మహతి తన సీట్లోంచి లేచిందగ్గర్నించి డయాస్‌మీదకు వెళ్ళేంతవరకూ చప్పట్లతో క్లబ్ దద్దరిల్లిపోయింది.

"గుడ్ ఈవెనింగ్ లేడీస్, జంటిల్‌మన్ అండ్ మిష్టర్ మధుకర్. ఒకబ్బాయి, ఒకమ్మాయిని ముద్దుపెట్టుకోవడం సహజం ..... అబ్బాయి, ముద్దుకి ముందు చొరవ చూపిస్తాడు కాబట్టి- కానీ ..... ఒక అమ్మాయి ఒకబ్బాయిని ముద్దుపెట్టుకోవడం, అదీ ఇంతమంది మధ్య ..... ఇది రేర్ అకేషన్, అందుకే ఇది రేర్ ఈవెనింగ్ .....

ఈ ఈవెనింగ్ సెలబ్రేషన్‌కి కారణం ..... నేను చేసిన ఒక సవాల్‌లో మా క్లాస్‌మేట్ మిష్టర్ మధుకర్ ..... గెలిచాడు ..... పోనీ గెలిచానని ఆయననుకుంటున్నాడు కాబట్టి, నేను మాత్రం అనుకోవడం లేదు ..... అది వేరే విషయం ..... మా ఒప్పందం ప్రకారం ..... నేను ..... మిష్టర్ మధుకర్‌ని ముద్దుపెట్టుకోవాలి.

నా పెదవులు మధుకర్ పెదవుల్ని ముద్దుపెట్టుకుంటాయి. ఇదీ మా ఒప్పందం ..... కాబట్టి ఆ ఒప్పందం ప్రకారం నేను మధుకర్‌ని ముద్దుపెట్టుకుంటాను. ఈ ఇన్సిడెంట్‌ని ఫోటోగ్రాఫర్లు ఫోటోలు తీసుకోవచ్చని కూడా పర్మిషన్ ఇస్తున్నాను.

సాధారణంగా యిలాంటి 'ఇన్సిడెంట్స్'కి పర్మిషన్ ఇవ్వరు ..... కానీ దానికి నెగిటివ్‌గా వుంది యిక్కడి వ్యవహారం.

సభ్యుల నరాల్లో జివ్వు, జివ్వున ప్రవహిస్తున్న ఉత్సాహం.

"ఒకే. మిష్టర్ మధుకర్ ..... మీరుకూడా డయాస్‌మీదకు రావాలని కోరుతున్నాను"

మహతి మాటకి మధుకర్ ఠీవిగా లేచి నిలబడ్డాడు. క్లాప్స్ .....

ది గ్రేట్ సిటిజన్ క్లబ్ సభ్యుల ఎదుట ఒక రేర్ రోమాంటిక్ హీరో, ఒక లవ్లీ రోమాంటిక్ హీరోయిన్.

వేదికమీద నిలువెత్తు అద్దాల్లో వాళ్ళిద్దరూ.

ఒక్కొక్కరూ ఆరుగురులాగా కన్పిస్తున్నారు.

స్పెషల్ లైట్ ఎఫెక్ట్స్ ప్రారంభమయ్యాయి. డిప్ ఆండ్ డిమ్ ..... డిప్ అండ్ డిమ్ ..... సభ్యుల గుండెల్లో లబ్ డబ్, లబ్ డబ్ .....

మహతి మనసులో ఏ ప్రకంపనలూ లేవు. కానీ మధుకర్ నరాల్లో ఏదో ఉద్వేగం, కసిగా, కసికసిగా మహతి పెదవుల్ని కొరికెయ్యాలని వుంది. మొత్తం ఎనిమిది అద్దాల్లో, కుడివేపు వున్న నాలుగు అద్దాల్లో మధుకర్ ప్రతిరూపం తీవిగా కన్పిస్తోంది.

"మైడియర్ మెంబర్స్ ..... ప్లీజ్ లిజన్ కేర్‌ఫుల్లీ ..... నేను మధుకర్ పెదవుల్ని ముద్దుపెట్టుకుంటాను ..... ముద్దుపెట్టుకుంటున్నాను" అంటూ హిప్నాటిస్టులా ఓ అద్దం ముందుకెళ్ళి, నిలబడి అద్దంలో కన్పిస్తున్న మధుకర్ పెదవుల్ని చూపుడు వేలితో ఒకసారి రాసి, ఆ పెదవులమీద తన పెదవుల్ని ఆనించి, పెద్ద చప్పుడు చేస్తూ ముద్దుపెట్టుకుంది.

The Kiss

ఇలాంటి ఫన్ యేదో జరుగుతుందని, కొంతమంది తెలివైన సభ్యులు ముందుగానే ఊహించారు.

మహిళలు, యూనివర్శిటీ అమ్మాయిలు పెద్దపెట్టున చప్పట్లు కొడుతూనే వున్నారు.

మగవాళ్ళు మాత్రం కొంతమంది నిరాశగా, ముందున్న డ్రింకుని విసురుగా అందుకున్నారు.

సుధారాణికి ఎందుకో చాలా ఆనందంగా వుంది.

అంత ఘోరంగా, అంత పబ్లిగ్గా, మధుకర్‌ను, ఫ్రూల్‌ని చేసినందుకు.

'Fool of the Year' ఎవరో స్టూడెంట్ గట్టిగా అరవడంతో అందరూ నవ్వేసారు.

ఫూల్ ..... ఫూల్ ..... ఫూల్ ..... ఫూల్ ..... మధుకర్!

వంట్లోని రక్తమంతా ఒక్కసారి మొహంలోకి చిమ్ముకొచ్చినట్లనిపించింది.

ఎవరో తనని చాచి కొట్టినట్టనిపించింది.

అతనివళ్ళంతా చెమట్లు పట్టేశాయి.

"యూ" పెదవులవరకు వచ్చిన ఆ మాట టక్కున ఆగిపోయింది.

మహతిని యిప్పుడు తనేమీ అనలేడు. ఏం చెయ్యలేడు.

అవును ..... తను నిజంగా, ఫూల్ అయిపోయాడు. రేపీవిషయం తన తండ్రికి తెలిస్తే, తనింకా ఫూల్ అయిపోతాడు.

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఈ అవమానాన్ని తను భరించలేడు.

కోపంగా మహతివేపు చూసి, డయాస్ దిగబోయాడు మధుకర్ .....

పిలిచింది మహతి ..... 'ఒన్ మినిట్' అని మధుకర్‌ని.

"డియర్ జంటిల్‌మెన్, లేడీస్ అండ్ ఫ్రెండ్స్, మీరందరూ నేను మధుకర్‌ని ఫూల్‌ని చేశానని నమ్మితే నమ్మండి. ప్రత్యక్షంగా అతని పెదవులమీద నేను ముద్దుపెట్టుకుంటానని చెప్పలేదు. ఏ మాత్రం ఆలోచించే శక్తిగల ఎవరయినా యీ పాయింట్‌ని ఈజిగా అర్థం చేసుకుంటారు, కానీ మధుకర్ ఎందుకర్థం చేసుకోలేదో నాకు తెలీదు. ఐయామ్ వెరీసారీ ..... ఇంకో విషయం ..... ఇంకా మన భారతీయ నాగరికత ముద్దుని బహిరంగంగా ఆమోదించలేదు. ఈ బహిరంగ ముద్దుకోసం మీరందరూ ఎదురు చూశారంటే సెక్స్‌పట్ల మీరెంత వెర్రిగా వున్నారో అర్థం అవుతోంది. ఐ పిటీ యూ ..... ఏ దేశానికయినా ఏ మూడు విషయాలు ప్రధానమైనవో,

అవి ఇక్కడ ఎలా వెర్రితలలు వేస్తున్నాయో అన్నదానికి ఇవ్వాళ జరిగిన సంఘటనే ఉదాహరణ.

చదువు, ఆలోచన, శ్రమ, శక్తి ఏ అభివృద్ధి చెందిన, చెందాలనుకునే దేశానికయినా మూలస్తంభాలు. చదువంటే మన యూనివర్శిటీ లిచ్చే డిగ్రీలు కాదు. అనుభవమే చదువు. అవగాహన చదువు ..... ఆత్మవిశ్వాసంతో ఎవరి కాళ్ళమీద వాళ్ళు నిలబడగలగడమే చదువు. ఆ చదువు మనదేశంలో యువతకు వివేకాన్నిస్తోందా? అన్న ప్రశ్నకు జవాబు శూన్యం. దానికి ఉదాహరణ- ఉదయం ఈ మధుకర్, నేను యేదో సరదాగా అన్న విషయాన్ని పట్టింపుగా తీసుకొని వివేకాన్ని, బాధ్యతను మరచిపోయి ప్రభుత్వపు ఆస్తిని, దాదాపు పాతికలక్షల ఆస్తిని ధ్వంసం చేశాడు. ఆ ధ్వంసం చేసేముందు ఒక్క నిమిషం ఆలోచిస్తే ఆ సంఘటన జరిగేదికాదు.

ఈ సంఘటన మన యువత లక్ష్యం లేకుండ పయనిస్తుందన్నదానికి నిదర్శనం అవునో కాదో చెప్పండి.

దీనికి సంబంధించిన చిన్న ఇన్సిడెంట్ చెప్తాను.

ఒక ఫిజియాలజీ ప్రొఫెసర్‌గారు క్లాసులో లెసన్ చెపుతూ, మధ్యలో ఆపి ఒకమ్మాయిని ఒక ప్రశ్న అడిగారు --

ఉద్రేకం ఎక్కువయినపుడు మన శరీరంలో ఏ భాగం పదిరెట్లు వ్యాకోచిస్తుందని.

దానికి ఆ అమ్మాయి జవాబు చెప్పడానికి సిగ్గుపడింది.

“దీనికి యిక్కడున్న ఇంతమందిలో ఏ ఒక్కరయినా జవాబు చెప్పగలిగితే ఆనందిస్తాను” అంటూ ప్రశ్న వేసింది మహతి.

“ఇదెక్కడ గొడవండిబాబు? అదేదో ‘కిస్’ ప్రోగ్రామనుకొని వస్తే, ఇదేదో క్విజ్ ప్రోగ్రామ్‌లా వుంది. ఎక్కడో కామెంట్ విన్పించింది. అంతా నిశ్శబ్దంగా వుంది. ఎక్కువమందికి అందులో బూతు అర్థమే ధ్వనిస్తోంది తప్ప మరే అర్థం కనిపించలేదు.

“ఒకే ..... లేడీస్ అండ్ జంటిల్మన్ సమాజంలో ఒక మేధావి వర్గం యిక్కడుందని నేననుకున్నాను. తప్పని తేలింది. ఒకే నేనే ఆన్సర్ చెప్తాను”.

అంటూ ఆ ప్రొఫెసర్ కథను కంటిన్యూ చేసింది మహతి.

“ఆ ప్రొఫెసర్ ఈసారి ఓ అబ్బాయిని ఆ ప్రశ్న అడిగాడు. ఆ అబ్బాయి వెంటనే లేచి, ‘కనుపాప’ అని జవాబు చెప్పడంతో ఆ ప్రొఫెసర్ కరెక్టు ఆన్సర్ వచ్చినందుకు చాలా ఆనందించాడు. కంటి లోని పాప మనం ఏదయినా ఆకస్మికంగా ఒక సంఘటనను చూసినపుడు ఒకటికి పదింతలు రెట్టింపవుతుంది--అన్న విషయం మీకు గుర్తుండకపోవడం విచారకరం.

అప్పుడా ప్రొఫెసర్ ఆ అమ్మాయివేపు తిరిగి -- ఆ అమ్మాయి ఎందుకు సిగ్గుపడిందో అన్నదానికి తిడుతూ.

మొదటిది పాఠాన్ని చదవకపోవడంవల్ల నీకు కన్ఫ్యూజన్ వచ్చింది. రెండోది ..... నీ ఆలోచన పాడయిపోవడంవల్ల ఒక మంచి ఆన్సర్ని వక్రంగా ఆలోచించగలిగావ్ ..... మూడు ఆ ఆలోచన వక్రంగా వెళ్ళడానికి కారణం ఒక లక్ష్యం లేకపోవడం అని వివరణ ఇచ్చాడు ప్రొఫెసర్.

ఈ సంఘటన యిప్పటి మన వ్యవస్థకు బాగా సరిపోతుంది. కన్ఫ్యూజన్ , ఆలోచనల వక్రత్వం, లక్ష్యం లేకపోవడం వల్ల సమాజం రోజురోజుకూ కుంటుపడుతోంది.

అందర్నీ తిట్టడం నా ఉద్దేశంకాదు-- మధుకర్ని తిట్టడంకూడా నా ఉద్దేశంకాదు.

ఇవాళ పాతిక లక్షల ఆస్థిని పదినిమిషాల్లో ధ్వంసం చేసిన వ్యక్తి రేపు కాంపెన్సేషన్ కట్టాలంటే, తండ్రి సంపదించిన కోట్లరూపాయలున్నాయి. కాబట్టి, అందులోంచి ఓ పాతికలక్షలు పారేస్తాడు-- దట్స్ ఎండ్ ది ఇష్యూ.

ఒక్క పైసా సంపాదించడం చేతకాకుండా, ఒక్క పైసా విలువ కూడా తెలీకుండా బతుకుతున్న ఈనాటి యువతరం లక్ష్యం ఏమిటి? అన్నదానికి ఏ ఒక్కరైనా జవాబివ్వండి చాలు” చెప్పడం ఆపింది మహతి.

తనని మహతి, అణువణువునూ కుళ్ళబొడిచి చంపేస్తున్నట్టుగా వుంది. తనని తిట్టడానికి అడ్డమైన స్టోరీలూ చెపుతోంది. అడ్డమైన ఇన్సిడెంట్లూ చెపుతోంది.

ఐ డోంట్ కేర్ దిస్ బ్లడీ గర్ల్ ..... అండ్ దిస్ నాన్సెన్స్ ..... కసిగా మనస్సులో అనుకుని, గబగబా డయాస్ దిగిపోయాడు మధుకర్.

ఈలలు ..... చప్పట్లు ..... గోల ..... హడావుడి.

సభ రభసగా మారిపోయింది. మహతి ఇంటర్నల్ ఫీలింగ్‌ని అతికొద్దిమంది మాత్రమే అర్థం చేసుకోగలిగారు.

వడిగా, వడి వడిగా పెద్ద అంగలతో బయటికొచ్చి కారెక్కాడు మధుకర్.

ఒక్క ఉదుటన కారు స్టార్ట్ చేశాడు. ఆ సమయంలో పరుగు పరుగున వచ్చి మూర్తి డోర్ తీసుకుని కారులో కూలబడ్డాడు.

కారు టాంక్‌బండ మీద తొంభై కిలోమీటర్ల వేగంతో పరుగెడుతోంది.

* * * *

"మధుకర్‌ని బాగా వెర్రెక్కించానా -- కిర్రెక్కించానా -- పిచ్చి వాడైపోయాడు కదూ. అతని జీవితంలో ఎప్పుడూ ఇలా జరిగుండదు కదూ?" నవ్వులు చిందిస్తూ సుధారాణిని అడిగింది మహతి.

"పాపం ..... ఎందుకే అతనంటే ..... అంత కక్ష?"

పక్కకు తలతిప్పి చూసింది మహతి.

"కక్ష కాదు ..... మైడియర్ ..... ప్రేమ ..... ఐలవ్ ..... హిమ్ ..... ఎస్ ..... సుధ ..... ఐ లైక్ హిమ్ సోమచ్ ..... " అంది మహతి.

"ఏమిటో నీ ప్రేమ నాకేం అర్థంకాలేదు" గొణుక్కుంది సుధారాణి.

* * * *

రాఘవేంద్ర నాయుడు మొట్టమొదటిసారి కొడుకు విషయంలో డిస్టర్బ్ అయ్యాడు.

ఒకింత కలత చెందాడు.

మొదట యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ఫోన్ చేశాడు..

తర్వాత సెక్యూరిటీ  ఆఫీసర్ వచ్చి జరిగింది చెప్పాడు.

"మీరంటే వున్న గౌరవంవల్ల ప్రెస్‌వాళ్ళు కూడా కరెక్టు న్యూస్ ఇవ్వలేదు. మధుకర్ తెలివితక్కువ తనంవల్ల, సిటిజన్ క్లబ్‌లో ఆ కిస్ ప్రోగ్రామ్ గొడవవల్ల పత్రికలవాళ్ళు గాసిప్ వార్తవేసి, మీ పేరును కూడా ఇరికించారు.

ఆ మాటకు- డైలీ పేపర్లో 'కిస్' ప్రోగ్రాం న్యూస్ అయిటమ్ చదువుతున్న రాఘవేంద్ర నాయుడు పేపర్‌ని టేబిల్‌మీద విసురుగా పడేసి, సూటిగా సెక్యూరిటీ వేపు చూశాడు. మధుకర్ తెలివితక్కువ తనం అని వాడిన పద ప్రయోగం వల్ల రాఘవేంద్ర నాయుడు కళ్ళలోకి సర్రున కోపం వచ్చింది. కాని కళ్ళకి, మనసుకి ఏం సంబంధం లేదు. అలాంటి ట్రైనింగ్ ఆ కళ్ళది-- తీవ్రమైన కోపం వచ్చినప్పుడు, ఆ  కళ్ళు కామ్‌గా, కూల్‌గా వుంటాయి. అది నాయుడు కున్న రేరెస్ట్ క్వాలిటీ!

"ఐ విల్ డీల్ విత్ వి.సి" అంతే- ఆ ఒక్క మాటతో టాపిక్‌ని కట్ చేసేసాడు రాఘవేంద్ర నాయుడు.

"డీల్" అంటాడేమిటి! ఆ వి.సి. అసలే పోలిటీషియన్. ఎమ్మెల్యేగా ఎన్నికై రాజకీయాల్లోకొచ్చి, ఆ పార్టీ పవర్లోంచి పోగానే సీనియర్లను కిందకి తొక్కేసి వి.సి. అయిపోయాడు. తనెప్పుడో కూలి పోతాడని తెలుసు. అందుకే దీపం వుండగానే క్యాంపస్‌ని చక్కబెట్టుకుంటున్నాడు. నాయుడుతో కుమ్మక్కై లక్షలు మింగేయడం ఖాయం.

"సీ యూ సర్" దిగాలుగా బయటకొచ్చేశాడు సెక్యూరిటీ ఆఫీసర్. అదే సమయంలో లోనికెళ్ళాడు రాఘవేంద్ర నాయుడు పి.ఎ. రవికిరణ్.

“మీరడిగిన ఇన్‌ఫర్‌మేషన్ సంపాదించాను సర్ ..... ” వినయంగా నిలబడిన రవికిరణ్ వేపు చూసి కూర్చోమన్నాట్లు సంజ్ఞ చేసాడు. రవికిరణ్ కూర్చున్నడు.

“ఏమిటిది ..... ” కొడుకు మధుకర్ గురించి ఏం చేస్తాడో? గత కొన్ని నెలలుగా మధుకర్ తెలివి తక్కువ పన్లకి అంతు లేకుండా పోతోంది. అతను చేసే ఆ పన్లన్నింటినీ తన తెలివితేటల్తో మసిబూసి మారేడుకాయ చేసి లాభం క్రింద మార్చకపోతే, ఈ పాటికి తనెంతో నష్టపోయుండేవాడు.

డబ్బును డబ్బు సంపాదిస్తుంది-- బట్ వాటెబౌట్ ప్రెస్టేజ్?

ప్రెస్టేజ్ పోతే మరి రాదు. కోట్లు కుమ్మరించినా మరి రాదు. అందుకే కొడుకుమీద నిఘా పెట్టాడు.

తను సంపాదించిన ఇన్‌ఫర్‌మేషనంతా చెప్పాడు రవికిరణ్.

“మహతి అనే అమ్మాయి ప్రవోక్ చేస్తే మధుకర్ గారు ఆ పని చేశార్ట ..... ” ముక్తాయింపుగా అన్నాడు రవికిరణ్.

“ఎవరా మహతి?”

“ రాజేంద్ర ప్రసాద్ అని ప్రసాద్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ కూతురు.”

“అందంగా వుంటుందా? ప్రసాద్ ఇండస్ట్రీస్ టర్నోవర్ ఎంత?”

“లాస్టియర్ మిస్ యూనివర్సిటీ వచ్చిందట. దాదాపు యాభై అరవై లక్షలు” పొదుపుగా సమాధానమిచ్చాడు.

మధుకర్‌ని దారిలో పెట్టడం ఎలా? ఎవరయినా ఇంటెలిజెన్స్‌ని, పవర్‌ని వేస్టుచేస్తున్నారంటే రాఘవేంద్ర నాయుడు సహించలేడు. అందులోనూ కన్నకొడుకు మధుకర్ మీద అపరిమితమైన ప్రేమతో పాటు-- దారి తప్పి పోతున్నాడనే రవ్వంత బాధ ఆయన గుండె లోతుల్లో కలుక్కుమంటోంది.

" మధుకర్‌ని ఎట్లా డైవర్ట్ చేస్తే బాగుంటుంది?" ఆ ప్రశ్నకు రవికిరణ్ ఆశ్చర్యంగా చూశాడు-- నాయుడు ఎప్పుడూ అడగడు, చెప్తాడు తప్ప.

"నాకు తెలీకకాదు ..... మీ ఒపీనియన్ కోసం"

"పెళ్ళి చేస్తే బాగుంటుంది సార్" టక్కున చెప్పాడు జవాబు పి.ఏ. నవ్వాడు రాఘవేంద్ర నాయుడు. ఆయన మనసులో వున్న ఉద్దేశం కూడా అదే! ప్రతిరోజూ ఏదో సమయంలో కొడుకు పెళ్ళి ప్రస్తావన తీసుకొస్తోంది భార్య. మధుకర్ పెళ్ళి నిమిషం క్రితంవరకూ అంత అర్జంట్ అనుకోలేదు. కానీ ఈ పరిస్థితుల్లో అర్జెన్సీగా కనిపోస్తోంది.

ఆలోచనల్లో పడ్డాడు నాయుడు.

"హార్వెస్ట్ కంపెనీకి లెటర్స్ వెళ్ళిపోయాయా?" ఆలోచిస్తూనే అడిగాడు నాయుడు.

"మీరు సైన్ చెయ్యాల్సి వుంది ..... "అంటూ ఛైర్మన్ గదికి ఆనుకుని వున్న తన రూంలోకెళ్ళి, ఓ ఫైల్ పట్టుకొచ్చి టేబిల్‌మీద పెట్టాడు.

"గుడ్ మార్నింగ్ డాడీ ..... " ఆ సమయంలో మధుకర్ వస్తాడని వూహించలేదు రాఘవేంద్ర నాయుడు ..... మధుకర్ లోనికి అడుగు పెట్టగానే, ఎందుకు వచ్చుంటాడో మాత్రం వూహించాడు వెంటనే-

"హాౌ ..... ఆర్యూ అంకుల్" రవికిరణ్‌ని విష్ చేస్తూ కుర్చీలో కూర్చున్నాడు. రవికిరణ్ లేచి తన రూంలో కెళ్ళిపోయాడు.

"డాడ్ ..... నిన్న చిన్న చాలెంజ్ చేసి, మా ఆడిటోరియంలోని స్టాచ్యూస్‌ని పగలకొట్టేశాను. కాంపెన్సేషన్ కట్టాలి ..... " ఏ మాత్రం మొహమాటం లేకుండా చెప్పాడు.

"ఎంత?"
"ట్వంటీఫైవ్ లాక్స్ ..... "